విచ్చలవిడిగా సెల్ టవర్ల ఏర్పాటు

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- కార్పొరేట్ సంస్థలతో అధికారుల కుమ్మక్కు
- రేడియేషన్ ప్రభావంతో అనారోగ్య ముప్పు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పూర్వం ఒకరి సమాచారం మరొకరు తెలుసుకోవాలంటే ఉత్తరాలు ఒక్కటే మార్గంగా ఉండేది. అప్పట్లో అత్యవసర సమాచారం తెలపాలంటే టెలిగ్రామ్‌లను వాడేవారు. మరీ అత్యవసరమైతే వేరే ఊరిలోని బంధువులకో, మిత్రులకో సమాచారం అందించాలంటే ఒక మనిషిని ఆ ఊరు పంపేవారు. ఆ తరువాత పోస్టాఫీసుల్లో ట్రంక్ కాల్ బుక్ చేసుకుని మాట్లాడే పరిస్థితి ఉండేది. తరువాత ల్యాండ్ లైన్ ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. అది కూడా ఒక ఊరిలో ఇద్దరు ముగ్గురికి మాత్రమే ఉండేవి. ఇదంతా మూడు దశాబ్దాల క్రితం మాట.. అనంతరం సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేసింది. మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తరువాత సమాచార మార్పిడి వ్యవస్థ అరచేతిలోకి వచ్చేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలందరికీ సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. చిన్నపిల్లలు మినహా ప్రతి ఒక్కరి చేతిలోనూ సెల్‌ఫోన్ దర్శనమిస్తోంది. అవసరాలకు ఫోన్ ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, దాని వల్ల కొన్ని ఇబ్బందికర పరిస్థితులు కూడా ఉన్నాయన్న విషయం గుర్తుంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు. సెల్‌ఫోన్లకు సిగ్నల్ అందించే టవర్ల వల్ల విపరీతమైన రేడియేషన్ ప్రజల ఆరోగ్యాలపై పెను ప్రభావమే చూపుతున్నాయి. జనావాసాల మధ్య టవర్లు ఏర్పాటు చేయడం వల్ల వాటి నుంచి విడుదలయ్యే అధిక రేడియేషన్ కారణంగా ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

కొన్ని కార్పొరేట్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం ఏమైతే తమకేంటనే ధోరణి కొన్ని కార్పొరేట్ సంస్థల్లో కనిపిస్తోంది. తమ వ్యాపారం కోసం సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్న సంస్థలు నిబంధనలకు పాతరేస్తున్నాయి. రేడియేషన్ పెద్ద ఎత్తున విడుదల అవుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పక్షిజాతులు సైతం అంతరించిపోయాయి. సెల్ టవర్లను పాఠశాల భవనాలపై, నివాస గృహాల మధ్య ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. భూమి కంపించినా, గాలితో కూడిన వర్షం వచ్చినప్పుడు అవి కూలితే పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుంది. పట్టణాలు, గ్రామాల్లో నివాస గృహాల మధ్య ఒకే టవర్‌పై వివిధ కంపెనీలకు చెందిన పరికరాలు అమర్చడంతో అక్కడ అధిక రేడియేషన్ వెలువడుతోందని, ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ, పట్టణాల్లో అయితే టౌన్‌ప్లానింగ్ అధికారుల నివేదిక అనుగుణంగా అనుమతులు ఇస్తారు. ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ 183) ప్రకారం అనుమతులు లేనిదే ఎక్కడబడితే అక్కడ సెల్ టవర్ ఏర్పాటు చేయడానికి వీలు లేదు. జిల్లాలో చాలా టవర్లకు అనుమతులు లేవని తెలుస్తోంది. స్థానిక అధికారులు కంపెనీ ప్రతినిధులతో చేతులు కలిపి విచ్చలవిడిగా టవర్లు ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలు బేఖాతరు చేస్తూ అధికారులు అవసరానికి మించి అనుమతులిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


కొత్తపేటలోని ఒక బిల్డింగ్‌పై ఏర్పాటు చేసిన సెల్ టవర్


గన్‌బజారులో నివాసాల మధ్య ఉన్న సెల్ టవర్


జీఎన్‌టీ రోడ్డులో ఒక బిల్డింగ్‌పై ఉన్న టవర్

ప్రతి డివిజన్‌లో నాలుగైదు టవర్లు

ఏలూరు నగరంలోని దాదాపు ప్రతి డివిజన్‌లో సెల్ టవర్‌లు ఏర్పాటు చేశారు. ఎక్కువగా నివాస ప్రాంతాలు, మార్కెట్ ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ల వినియోగం అధికంగా ఉండే అవకాశం ఉండడంతో వినియోగదారులకు అంతరాయంలేని సేవలు అందించడానికి గాను ఎక్కువ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. దీనితో ఎక్కువ మంది ఉండే ప్రాంతాల్లో ఎక్కువ రేడియేషన్ ఉండే ప్రమాదం కూడా లేకపోలేదు. ఇలా నగరంలో 50 డివిజన్లు ఉండగా ప్రతి డివిజన్‌లో తక్కువలో తక్కువ మూడు టవర్లు, గరిష్ఠంగా 6 టవర్లు ఉన్న ప్రాంతాలు కూడా ఉన్నాయి. అలాగే ఏలూరు మండలంలోని ఆయా గ్రామాల్లో కూడా సెల్ టవర్లు లేని ప్రాంతం కనిపించడం లేదు. ముఖ్యంగా ఏలూరు మండలంలో కొల్లేరు ప్రాంతమే అధికంగా ఉంది. ఈ ప్రాంతం పక్షుల విడిది కేంద్రాలుగా గుర్తింపు ఉన్న ప్రాంతం. అందువల్ల సెల్ టవర్ల రేడియేషన్ ప్రభావంతో కొన్ని అరుదైన పక్షి జాతులు నశించిపోతున్నాయని కొల్లేరువాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టానుసారంగా టవర్ల ఏర్పాటు



నగరంలో ఇష్టానుసారంగా సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల వాటి రేడియేషన్ ప్రభావంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. నిబంధనలకు విరుద్ధంగా టవర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఒక్కో ఇంటి డాబాపై ఒకే టవర్‌కు పలు కంపెనీలకు చెందిన పరికరాలు ఏర్పాటు చేయడంతో రేడియేషన్ అధిక మొత్తంలో విడుదలవు తోంది. అధికారులు స్పందించి జనావాసాల నడుమ ఉన్న టవర్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– కాకర్లమూడి రమేష్‌బాబు, స్థానికుడు

క్లుప్తంగా

ఘనంగా మండల్ డే


బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): మండల్ డే సందర్భంగా స్థానిక యాదవ సంక్షేమ భవనంలో బీసీ ఐకాస ఆధ్వర్యంలో లంకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో తొలిసారిగా బీసీ రిజర్వేషన్లు అమలు చేసి సామాజిక న్యాయం కల్పించిన ఘనత బీపీ మండల్‌కు, నాటి ప్రధాని పీవీ నరసింహారావుకు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కల ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జెఏసి ఉపాధ్యక్షులు ఉక్కుసూరి గోపాల కృష్ణ కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎం.సూర్య నారాయణ, కార్యదర్శి మార్గాని శ్రీనివాస్, లక్కోజు గోపి, ఆలమండ రామారావు, గొర్ల రామారావు, అన్నపురెడ్డి మురళి, గండకట్టి సుధాకర్ పాల్గొన్నారు.

నేడు జిల్లా సమగ్రాభివృద్ధిపై సదస్సు

ఏలూరు (టూటౌన్): జిల్లా సమగ్రాభివృద్ధిపై శుక్రవారం ఏలూరులో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి ఎ.లక్ష్మీ ఇందిరా కోరారు. ఈ మేరకు 1, 2వ డివిజన్లలో గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు. బహుళార్థక సాధక పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితులకు పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గణపతి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో గురువారం స్వామి వారి హుండీ ఆదాయం లెక్కించారు. ఈ లెక్కింపులో స్వామి వారికి హుండీల ద్వారా రూ.85,229 ఆదాయం వచ్చింది. మొత్తం 64 రోజులకు గానూ ఈ ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వర రావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని ఏలూరు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎం.రాధ పర్యవేక్షించగా సత్రంపాడు వీఆర్‌ఓలు రవి కుమార్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ, వాణిజ్య అధికారి ఎండీపీ శ్రీనివాసరావు సూచించారు. రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం స్థానిక మార్కెట్‌యార్డులో సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టంపై పలువురికి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వి.మహేంద్రనాథ్, ఏలూరు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జి.మంజుల తదితరులు పాల్గొన్నారు.

రాజారావుపై చర్యలు తీసుకోవాలని వినతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులను అనేక విధాలుగా వేధిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఏలూరు నగరపాలక పరిధిలోని ఏఆర్‌డీజీకే నగరపాలక ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జొన్నూటి రాజారావుపై శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌టీయూ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకట లక్ష్మమ్మను కోరారు. ఈ మేరకు గురువారం డీఈఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాజారావు గత నాలుగు సంవత్సరాలుగా ఏలూరు నగరపాలక పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను, కొంతమంది అధికారులను అనేక దఫాలుగా ఫిర్యాదుల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎస్‌టీయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ పవన్ కుమార్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పీబీవీఎస్ఎల్ నారాయణ తదితరులు ఉన్నారు.

నేతన్నల నడ్డి విరిచిన కూటమి ప్రభుత్వం


జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జేపీ, పార్టీ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో నేతన్నలను ఆదుకునేందుకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక పథకాలు అమలు చేయగా కూటమి ప్రభుత్వం ఆయా పథకాలను రద్దు చేసి వారి నడ్డి విరిచిందని వైసీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్ (జేపీ) ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం పార్టీ చేనేత విభాగం నగర అధ్యక్షుడు యర్ర రాంబాబు, కొల్లిపాక సురేష్, కొండపల్లి పరమేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేపీ మాట్లాడుతూ ఉపాధి లేక నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే అప్పటి టీడీపీ ప్రభుత్వం చోద్యం చూసిందని, అనంతరం ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే నేతన్నలను ఆదుకోవడానికి నేతన్ననేస్తం పథకాన్ని ప్రవేశ పెట్టి వారి ఖాతాల్లోకి నేరుగా ఆర్థి సహాయం మొత్తాన్ని వేసి నేతన్నలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి చేతులు దులుపుకోవడం నేతన్నలను దగా చేయడమేనన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన అవసరం


తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర కె.వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): తల్లి పాల ప్రాముఖ్యతపై జిల్లాలోని ప్రతీ గర్భిణీ, బాలింతలకు అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. తల్లి పాల వారోత్సవ కార్యక్రమాలలో భాగంగా స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రిపాలు తప్పనిసరిగా పట్టించాలన్నారు. తల్లిపాలు త్రాగే పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. తల్లిపాలు అందించడంవల్ల బిడ్డతో పాటు తల్లికి కూడా ఉపయోగాలున్నాయన్నారు. జిల్లాలోని బస్టాండ్లు, సినిమా హాళ్లు, మాల్స్, తదితర పబ్లిక్ ప్రదేశాలలో బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. ఐసీడీఎస్ పీడీ పి.శారద మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాలు ప్రాముఖ్యతపై జిల్లాలోని ప్రతి గర్భిణీ, బాలింతలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. జిల్లాలో 24 బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్‌లు ఉన్నాయని, మరికొన్ని ఏర్పాటుకు ఆలోచన చేస్తామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓలు పద్మావతి, తులసి, లీగల్ అడ్వయిజర్ రాఘవమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	28	బిళ్లచిక్కుడు	160
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	54	కంద	00
కాకర కాయలు	40	బీట్‌రూట్	38
బీరకాయలు	24	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	34	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	68-86
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	22
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - తిరుపతి	16.00	4830	23

ఖాసీంకు జేపీ పరామర్శ


ఖాసీంను పరామర్శిస్తున్న జేపీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగ నాయకుడు ఎస్‌కే ఖాసీం తండ్రి గురువారం మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మామిళ్ళపల్లి జయ ప్రకాష్ ఆయన గృహానికి చేరుకుని పరామర్శించారు. తొలుత ఖాసీం తండ్రి భౌతిక కాయానికి పూలమాలలతో నివాళులు అర్పించి ఖాసీం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, ఇమ్మాన్యుయేల్ జైకర్, కొల్లిపాక సురేష్, ముద్దుండి ప్రవీణ్, రెల్ల రామకృష్ణ ఉన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి


సూర్యచంద్రరావును సన్మానిస్తున్న ఏలూరు ఇంజనీరింగ్ కాలేజ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంజినీరింగ్ విద్యార్థులు నాలుగేళ్లు కష్టపడి చదివితే భవిష్యత్‌లో నలభై ఏళ్ళ పాటు సుఖంగా జీవించవచ్చని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్.సూర్య చంద్రరావు సూచించారు. స్థానిక ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థుల పరిచయ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మన్యూనత భావాన్ని విడిచి క్రమశిక్షణతో విద్యను నేర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ పి.బాలకృష్ణ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ అడ్మిన్ ఎన్. సూర్యచంద్రరావు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక చైర్మన్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, చైర్మన్ వనమా రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం


బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న జేపీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మామిళ్ళపల్లి జయ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం గురువారం నగరంలోని 49,50 డివిజన్‌లలో ఘంటా మోహన్ రావు, పల్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేపీ మాట్లాడుతూ వేల కోట్ల అప్పులు తీసుకువచ్చిన కూటమి ప్రభుత్వం ఆ డబ్బు మొత్తాన్ని ఏం చేసిందో? ప్రజలకు చెప్పాలని నిలదీశారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా, ఎక్కడా ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టకుండా కేంద్రం నుంచి తెచ్చిన కోట్ల నిధులను ఎవరి జేబుల్లో వేసుకున్నారో? ప్రజలకు తెలియాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాయరు శ్రీనివాస్, అలజంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీతాలందక పారిశుద్ధ్య కార్మికుల ఇబ్బందులు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం జాలపూడి గ్రామపంచాయతీలో ఐదు నెలల పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు మంజూరుకాలేదు. జీతాలు ఇవ్వకపోవడంతో అవి వస్తాయా? రావా? తెలియక అయోమయంలో సిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు. అధికారుల నుంచి పూర్తిస్థాయిలో భరోసా రాకపోవడంతో గ్రామంలో పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగానే నిర్వహిస్తున్నారు. దళిత కాలనీలో అయితే పూర్తిగా పారిశుద్ధ్య పనులు జరగడం లేదు. గ్రామస్తులు సైతం జీతాలు ఇవ్వకపోతే వాళ్లు మాత్రం ఎలా వస్తారు? ఎలా పనులు చేస్తారు? గట్టిగా నిలదీయలేకపోతున్నారు. మండల జిల్లా స్థాయి అధికారుల పూర్తిస్థాయి పర్యవేక్షణ జరగకపోవడం పారిశుద్ధ్య సిబ్బందికి శాపంగా మారింది. ఐదు నెలలుగా జీతాలు లేకుండా మండల జిల్లా అధికారులు ఉంటారా? అన్న ప్రశ్న గ్రామస్తుల నుంచి వ్యక్తం అవుతుంది. అయితే ఈ విషయంపై గ్రామ కార్యదర్శి వివరణ కోరగా జాలిపూడి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య సమస్యలు ఉండడం వాస్తవమేనని పంచాయతీకి సంబంధించి సమస్యను డీపీఓ దృష్టిలో పెట్టామని చెప్పడం గమనార్హం.

హోమ్‌గార్డ్స్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం


హోమ్‌గార్డుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ ఏ. జోషి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా హోమ్‌గార్డ్స్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని విశాఖపట్నం హోమ్‌గార్డ్స్ కమాండెంట్ ఎ.జోషి స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా హోమ్‌గార్డ్స్ యూనిట్ తనిఖీలో భాగంగా గురువారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో హోమ్‌గార్డుల కవాతును ఆయన పర్యవేక్షించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డులు తమ ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించి రెగ్యులర్‌గా మెడికల్ చెకప్ చేసుకోవాలని, హోంగార్డ్ ఎవ్వరూ చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడకుండా మంచి క్రమశిక్షణతో తమ విధులను నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని హితవు పలికారు. తొలుత ఆయన ఏలూరు ఎస్పీ కే. ప్రతాప్ శివ కిషోర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట రాజమహేంద్రవరం హోమ్‌గార్డ్స్ డీఎస్పీ కేఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏలూరు డీఎస్పీ చంద్రశేఖర్, ఏఆర్ ఇన్స్‌పెక్టర్ పవన్ కుమార్, భాస్కర రావు ఉన్నారు.